క్లుప్తంగా

మండల ప్రధాన కార్యదర్శిగా రాజు



చిన్నగూడూరు: కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ ఆదేశాల మేరకు డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కమలాకర్ ఆధ్వర్యంలో రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రూ.40వేల విరాళం



దంతాలపల్లి: మండలం దాట్ల గ్రామంలో పెద్దమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన చెగువేరా యూత్ సభ్యులు ఆదివారం రూ.40,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు చిదర వెంకటరమణ, చిత్తలూరి నవీన్, గుండగాని హరీశ్, బోర శ్యామ్, కొమ్మినేని యాకాంత్, పాడిశెట్టి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను ఆదుకుంటాం



తొర్రూరు: ఆర్యవైశుల అభ్యున్నతి కోసం అన్నివిధాలుగా ఆదుకొని వారి అభివృద్ధి కోసం సహకరిస్తామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఆర్యవైశ్య సంఘాలు, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన శ్రావణమాస వనభోజనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బిజ్జాల అనిల్‌కుమార్, వందేటి అశోక్ కుమార్, గౌరి శంకర్, వనజపల్లి అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

కురవి: ఈనెల 27వ తేదీన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు నాగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా ఉంటుందని ఆయన వివరించారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి

తొర్రూరు: బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో తొర్రూరు మున్సిపాలిటీ అన్ని విధాలుగా అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్‌రావు, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు



మహబూబాబాద్ రూరల్: శ్రావణ మాస పూజా వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కొత్త బజారు ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు చేసి బోనం సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలో ఆదివారం ఘనంగా ముత్యాలమ్మకు బోనాలు చెల్లించారు.

ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన వేడుకలు ఆపొద్దు

గార్ల: మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ దైవకార్యంను నిలిపి వేయవద్దని, అందరి సహకారంతో కొనసాగించాలని ఎన్నారై దేవాలయం అభివృద్ధి ప్రదాత పులి గోపాల్‌రెడ్డి, ప్రమీలారెడ్డి కోరారు. ఆదివారం మర్రిగూడెం దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏడాది క్రితం దేవాలయ పునర్ నిర్మాణం కోసం రూ.1.50కోట్లు విరాళం ఇచ్చామని, ఇట్టి విరాళంతో దేవాలయం రూపురేఖలు మార్చి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. 2నెలల క్రితం గాలిదుమారంతో ఆలయంలోని ధ్వజస్తంభం నేలమట్టమైందన్నారు. నూతన ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠకు అమెరికా నుంచి తమను రావాలని కోరడంతో వచ్చామన్నారు. ఈనెల 28న ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం రద్దు అయినట్లు తెలియడంతో తీవ్ర మనోవేదనకు లోనయ్యామని తెలిపారు.

ఏజెన్సీలో బియ్యం దందా

- ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని రహస్యంగా తరలింపు
- రూ.5కు కొని, రూ.18కి విక్రయం



పాగుళ్లపల్లిలో ఇటీవల పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

కొత్తగూడ: కొత్తగూడ, గంగారం ఏజెన్సీ మండలాల్లో గుట్టు చప్పుడు కాకుండా రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. కొందరు వ్యక్తులు గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని లబ్ధిదారుల వద్ద నుంచి పీడీఎస్ బియ్యం సేకరించి రహస్యంగా తరలిస్తున్నారు. కొందరు వ్యక్తులు నూకల పేరుతో రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. లబ్ధిదారుల వద్ద నుంచి కేజీ రూ.5 కొనుగోలు చేసి రూ.18 విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎక్కడికి తరలిస్తున్నారు?

ఏజెన్సీ మండలాల్లో సేకరించిన బియ్యం ఎక్కడికి తరలిస్తున్నారు అనే విషయం మాత్రం ఎవ్వరికీ తెలియకుండా దందా చేసే వ్యాపారులు జాగ్రత్త పడుతున్నారు. మిల్లర్లకు ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యం కింద బియ్యం వెంటనే ప్రభుత్వానికి ఇవ్వాలని ఒత్తిడి పెరగడంతో రీసైక్లింగ్ దందా షురూ చేసినట్లు తెలుస్తోంది. కొత్తగూడ మండలం గుండంపల్లి మీదుగా వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని ఓ మిల్లుకు తరలిస్తున్నట్లు మండలంలో చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా మండలానికి చెందిన ఓ మిల్లర్ కుటుంబ సభ్యులే స్వయంగా రేషన్ బియ్యం లబ్ధిదారుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నట్లు చర్చ జరుగుతుంది. గంగారం మండలం నుంచి కొందరు వ్యక్తులు భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు తరలిస్తున్నట్లు సమాచారం.

> **చర్యలు తీసుకుంటాం..**
>
> బియ్యం అక్రమ రవాణపై పూర్తి స్థాయిలో విచారిస్తున్నాం. ఎవ్వరినీ వదలం. సేకరించిన వారి నుంచి కొనుగోలు చేసే వారి దాక అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
>
> – ఎస్సై కుశకుమార్, కొత్తగూడ

విచారించి వదిలేస్తారా..?

శనివారం రాత్రి పాగుళ్లపల్లిలో పోలీసులు బియ్యం పట్టుకుని స్టేషన్‌కు తరలించేందుకు యత్నించగా పోలీసులకే మస్కా కొట్టి బియ్యం లోడుతో సహా పరారీ అయినట్లు తెలిసింది. దీంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి బియ్యం లోడు చేసిన వారిని పట్టుకుని విచారించగా నీలంపెల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో బియ్యం వాహనం లభించింది. బియ్యం ఎక్కడికి పోతున్నాయనే అంశాన్ని పోలీసులు సవాలుగా తీసుకున్నట్లు సమాచారం. విచారించి వదిలేస్తారా..? బియ్యం దందాకు కారణం అయిన అందరిని పట్టుకుంటారా..? అనే చర్చ మండలంలో జోరుగా సాగుతోంది.

పార్టీ వ్యతిరేకులపై చర్య తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గూడూరు: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తూ చెడుపేరు తెస్తున్న నాయకులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చర్య తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంత మంది బీఆర్ఎస్ నాయకులు పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడడం సరికాదన్నారు. ప్రజలు ఇప్పటికీ కాంగ్రెస్‌కు ఓటేసినందుకు బాధపడుతున్నారని, ఎన్నికల ముందు సీఎం రేవంత్ ఇచ్చిన ఆరు గ్యారంటీల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు సత్తాచాటాలని సూచించారు. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకునేందుకు తానున్నానని శంకర్‌నాయక్ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, నాయకులు జలగం సంపత్‌రావు, నూకల సురేందర్, ఎండి. రహీంపాష, నర్సింహానాయక్, కతార్‌సింగ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'కస్తూర్బా'లో ముళ్లపొదల తొలగింపు



ముళ్ల పొదలను తొలగిస్తున్న డోజర్

డోర్నకల్: స్థానిక కస్తూర్బా పాఠశాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. కొద్ది రోజుల క్రితం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ పాఠశాలను తనిఖీ చేసి ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ఆధ్వర్యంలో డోజర్ వాహనంతో పాఠశాల ఆవరణలోని ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈసందర్భంగా చైర్మన్ వీరన్న మాట్లాడుతూ.. జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాల బాలికలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న శివరాములు

మహబూబాబాద్ రూరల్: హిందూ సమాజాన్ని సంఘటితం చేయడమే విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు అన్నారు. విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని అనంతాద్రి మైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాములు మాట్లాడుతూ.. కుల వివక్ష అనే తేడా లేకుండా అన్ని హిందూ కులాలు ఒక తాటిపై వచ్చి సమాజాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశ అనంతరం మహబూబాబాద్ జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ కృష్ణమోహన్, కార్యదర్శిగా నరేష్‌ను ఎన్నుకున్నారు.

మెస్‌చార్జీలు పెంచాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనింగ్ కమిటీ సభ్యులు రాకేశ్, సూర్యప్రకాష్, నాయకులు లక్ష్మణ్, జీవన్, మహేశ్, వినయ్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సర్టిఫికెట్లతో విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పుష్పలీల అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆదివారం యోగా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పలీల మాట్లాడుతూ.. ప్రతీ ప్రభుత్వ పాఠశాల ల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతిలో యోగా శిక్షణ అందించాలన్నారు. ఈ ఎంపిక పోటీలకు సుమారు 150 మంది విద్యార్థులు హాజరుకాగా బాలికలు 20మంది, బాలురు 20మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరేష్, పీజీ హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ హెచ్ఎం గిరిజ, పర్యవేక్షులు రాము, పీఈటీ సంఘం కార్యదర్శి చాంప్లనాయక్, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది

చిన్నగూడూరు(నర్సింహులపేట): కస్తూర్బాగాంధీ పాఠశాల, కాలేజీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఆదివారం నర్సింహులపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సిబ్బందితో కలిసి ఆగస్టు 30న చలో హైదరాబాద్ కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. కస్తూర్బా గాంధీ పాఠశాల, కాలేజీలలో బోధన సిబ్బందికి నెలకు రూ.18వేల వేతనంతో పాటు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది విజయ, లత, సునీత, రేణుక, పుల్లమ్మ, కౌసల్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.30వేల ఆర్థికసాయం



గార్ల: గార్లకు చెందిన లాయర్ జంజాల యాదగిరిరావు ఇటీవల మృతిచెందడంతో, మృతుడి కుటుంబ సభ్యులకు ఇల్లెందు కోర్టు బార్ కౌన్సిల్ లాయర్లు రూ.30వేల నగదు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో లాయర్లు కృష్ణారెడ్డి, కార్తీక్, రవినాయక్, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌కి చెందిన మలిశెట్టి వీరయ్య అనే వ్యక్తి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబం పేదరికంలో ఉండడంతో సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ స్పందించారు. ఈమేరకు మృతుడి దహన సంస్కారాలకు రూ.8వేల ఆర్థికసాయాన్ని అందజేశాడు.

మంత్రి మండలి నిర్ణయాన్ని ఒప్పుకోం

మరిపెడ రూరల్/మరిపెడ: కొనుగోలు చేసుకునే పెన్షన్ మా కొద్దని, కేంద్ర మంత్రి మండలి ఉద్యోగుల కోసం తీసుకున్న నిర్ణయాన్ని తాము ఒప్పుకోమని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్ అన్నారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర కేబినెట్ నిర్ణయాల్లో నూతన పెన్షన్ విధానంపై తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ ఇచ్చి పెన్షన్ కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీనికి ఒప్పుకునే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దీని గురించి మరోసారి పునరాలోచించాలని అన్నారు. రాష్ట్రానికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మహేష్‌గౌడ్ డిమాండ్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

బయ్యారం: బయ్యారం సొసైటీ పరిధిలో ఇచ్చిన పంటరుణాలపై అధికారులు విచారణ నిర్వహించాలని బీజేపీ అనుబంధ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికార పార్టీలో కొనసాగుతున్న సొసైటీ చైర్మన్ నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేసి, అర్హులైన రైతులకు అన్యాయం చేశారని ఆమె ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం తగదని ఇప్పటికైనా సొసైటీలో ఇచ్చిన రుణాలపై విచారణ నిర్వహించి అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజయ, రాథోడ్, మంగమ్మ, వీరన్న పాల్గొన్నారు.

వైద్యశిబిరం

పెద్దవంగర: మండలంలోని చిట్యాల గ్రామంలో మెడికేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నరేష్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమా, కిరణ్, రాధాకృష్ణ, చరణ్, సందీప్, జనవికాస ప్రతినిధులు శైలజ, సరిత, జీపీ కార్యదర్శి రాజు, కారోబార్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి మృతి



యాకయ్య (ఫైల్)

చిన్నగూడూరు: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని తుమ్మిడి చెరువులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గంగరబోయిన యాకయ్య(65) శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని తుమ్మిడి చెరువులోకి చేపల వేటకు వెళ్లాడు. చెరువులోకి దిగిన క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. సంఘటన జరిగి రెండు రోజులు గడుస్తుండడంతో యాకయ్య మృతదేహం ఉబ్బి చెరువులో పైకి తేలింది. గమనించిన స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి మతిస్థిమితం లేని భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రోటిబండ తండా జీపీ పరిధిలోని దూదియా తండాకు చెందిన ఇంటర్ విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం సమయంలో తల్లిదండ్రులతో కలిసి పొలంలో కలుపు తీసేందుకు వెళ్లిన విద్యార్థినిని మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్లి అన్నం తీసుకు రావాల్సిందిగా తల్లి కోరింది. మొదట తాను వెళ్లనని చెప్పిన సదరు విద్యార్థిని కాసేపటికి అన్నం తీసుకొస్తానని చెప్పి ఇంటికి వెళ్లింది. ఏం జరిగిందో ఏమోకానీ ఇంట్లో ఎవరూలేని సమయంలో సదరు విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సమయానికి ఆమె సోదరుడు వచ్చి చూసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి పరిశీలించగా.. అప్పటికే మృతిచెందింది. అయితే విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సిఉండగా.. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఈ విషయంపై రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డిని వివరణ కోరగా విద్యార్థిని ఆత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆభరణాల చోరీ

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో శ్రీరంగం శ్రీనివాస్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు కురవి ఏఎస్సై జె.సదయ్య ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన శ్రీరంగం శ్రీనివాస్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 23న బంధువుల పెళ్లికి వెళ్లారు. తిరిగి ఆదివారం(25న) ఇంటికి వచ్చి చూసే సరికి తాళాలు తీసి ఉండడాన్ని గమనించారు. దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న తులంన్నర చెవి దిద్దులు, పది తులాల ఆరు వెండి గ్లాసులను దొంగిలించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సదయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కురవి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన బజ్జూరి రాంచంద్రు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా మరిపెడ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో రాంచంద్రుకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు కారును ఆపి కురవి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారును, పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. 108లో క్షతగాత్రుడిని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

బీసీలకు రిజర్వ్ స్థానాలు కేటాయించాలి

నెహ్రూసెంటర్: బీసీలకు చట్టసభల్లో రిజర్వ్ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బీపీ మండల్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో గంగాధరి బాలరాజు, గంధసిరి వేణు, దూదిమెట్ల మోహన్‌రావు, కమలాకర్, రమేశ్ పాల్గొన్నారు.

దోషులను రక్షించేందుకు పాలకుల కుట్ర

మహబూబాబాద్ రూరల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, మృతి ఘటనలో దోషులను రక్షించేందుకు పాలకులు పూనుకోవడం దుర్మార్గమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చారి హరీశ్, యువజన సంఘాల నాయకులు మహేశ్, మహమ్మద్ అసిఫ్, శ్రీకాంత్, రాజ్ కుమార్, ఎల్లేష్ ఆరోపించారు. మండలంలోని లక్ష్మి పురం(బి) గ్రామంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు.


మానసిక భావనలో మార్పు రావాలి

గార్ల: మనిషి మానసిక భావనలో మార్పు రావాలని విశ్వసమాజం వ్యవస్థాపకుడు జంపాల విశ్వ అన్నారు. ఆదివారం స్థానిక వర్తకసంఘం భవనంలో విశ్వసమాజంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధునికత, అభివృద్ధి పేరుతో మానవులు మానవత్వాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సదస్సులో విశ్వసమాజం కన్వీనర్ బాజ సైదులు, రచయిత నాగవెల్లి జితేందర్ సామ్రాట్, కోకన్వీనర్ చిర్ర రవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: కేసముద్రం మండల సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్(అగ్రి) ఎంప్లాయిస్ యూనియన్ ఫీల్డ్ స్టాఫ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా కల్వల గ్రామానికి చెందిన గండి శ్రీనివాస్ ఎన్నికయ్యాడు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల ఉపాధ్యక్షుడిగా ముదిగిరి సాంబయ్య, ప్రధాన కార్యదర్శి కంచ అశోక్, కోశాధికారి భుక్య రమేశ్, సహాయ కార్యదర్శి కత్తుల లింగస్వామి, కార్యవర్గ సభ్యులుగా కోరుకొండ వెంకట్, కంచ విజేందర్, ఎలేందర్, వాసుదేవరెడ్డి, బోడ యాకన్న, ముఖ్యసలహాదారులుగా అశోక్, వెంకన్న ఎన్నికయ్యారు.

ప్రజల పక్షాన పోరాడుదాం




గూడూరు: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారెంటీలు ప్రజలకు చేరేలా పార్టీ నాయకులు ఉద్యమించాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరిగిన పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నూకల ఉపేందర్‌యాదవ్, బందెల వీరస్వామి, ఎస్కే.సలీం, ఎడ్లపల్లి రమేష్, మారం నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

నెల్లికుదురు: మండల ఏఓగా పనిచేస్తున్న నెలకుర్తి రవీందర్‌రెడ్డి ఇటీవల ఖిలా వరంగల్‌కు బదిలీపై వెళ్లారు. ఈమేరకు స్థానిక రైతువేదికలో ఆదివారం మండల ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రవీందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు గుండ వెంకన్న, దేవేందర్‌రావు, లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



గార్ల: మండలంలో ఇటీవల మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం పరామర్శించారు. గార్లలోని పుట్టకోట బజారుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పందుల నారాయణ సతీమణి సీతమ్మ ఇటీవల మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అదే విధంగా మర్రిగూడెం గ్రామానికి చెందిన జాటోత్ కృష్ణ విషజ్వరంతో మృతిచెందడంతో మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

తొర్రూరు రూరల్: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని తొర్రూరు మాజీ జెడ్పీటీసీ, జిల్లా ఫ్లోర్‌లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్ అన్నారు. వెల్లికట్టే గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయిన బీఆర్ఎస్ కార్యకర్త బందు మహేందర్ (35) ప్రమాద బీమా చెక్కు రూ.2లక్షలను మృతుడి భార్య సరస్వతికి ఆదివారం అందజేశారు.

పెనుగొండలో వైద్యపరీక్షలు

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామంలో శ్రీసత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు జగదీశ్వర్, అక్షితలు రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రదీప్, గోవర్ధన్, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంచన శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ రామమందిరంలో అసోసియేషన్ 14వ వార్షికోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కోశాధికారి మురళీ, దయాకర్, పరమేశ్వర్, మురళీ, రఫీ, మధుసూదన్ పాల్గొన్నారు.

నేడు దేవయజ్ఞం

మహబూబాబాద్ రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆర్య సమాజ మందిరం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10గంటలకు లోక కల్యాణార్థం వేద మంత్రాలతో దేవ యజ్ఞం నిర్వహిస్తామని ఆర్యసమాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు నారాయణ ప్రకాష్ లోయ ఆదివారం తెలిపారు.

రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి



పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

మహబూబాబాద్/మహబూబాబాద్ రూరల్: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణ మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని కాంగ్రెస్ నాయకుడు గుగులోత్ రాములు అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు పరిధిలోని బోడతండా, పాతతండా సమీపంలోని పొలంలో రైతులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఫ్లెక్సీకి రైతులు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా గుగులోత్ రాములు నాయక్ మాట్లాడుతూ.. రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బోడ హరినాయక్, ఫుల్ సింగ్, ఈర్యా, మాన్‌సింగ్,తదితరులు పాల్గొన్నారు.